క్లుప్తంగా

ఆలయ నిర్మాణం ప్రారంభం

లింగాల: మండలంలోని నల్లమల అటవీ ప్రాంతమైన ఎర్రపెంటలో ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ ముందుకు వచ్చారు. సోమవారం పెంటను సందర్శించిన నాయకుల దృష్టికి గుడి నిర్మాణం గురించి చెంచులు తెలియజేశారు. పెంటలో ఆంజనేయస్వామి దేవాలయాన్ని సొంత ఖర్చులతో నిర్మిస్తామని హామీ ఇచ్చి వెంటనే పనులు ప్రారంభించారు.

పంటల నమోదు

కల్వకుర్తిరూరల్: మండలంలోని రైతులు సాగు చేసిన వరి పంటలను వ్యవసాయ శాఖ అధికారులు నమోదు ప్రక్రియను ప్రారంభించారు. సోమవారం మండలంలోని తిమ్మరాసిపల్లి వ్యవసాయ విస్తరణాధికారి రజినీకాంత్‌రెడ్డి పంట పొలాల వద్దకు వెళ్లి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

పారిశుద్ధ్యం సమష్టి బాధ్యత



అమ్రాబాద్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీడీఓ రామ్మోహన్ సూచించారు. సోమవారం మండలంలోని మాధవానిపల్లి సందర్శించి, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు గ్రామంలోని ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

వెంచర్ అనుమతిని రద్దు చేయాలి

ఊర్కొండ: మండల కేంద్రంలోని జడ్చర్ల, కల్వకుర్తి ప్రధాన రహదారిపై చేసిన వెంచర్ భూములు దళితులకు చెందే వరకు ఉద్యమం ఆగదని బీజేపీ నాయకులు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాష, జిల్లా అధ్యక్షుడు సుధాకర్ పాల్గొని మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన కొంత మంది నాయకులు దళితుల భూములకు కబ్జా చేసి వెంచర్‌లను చేసి రూ.కోట్లు దండుకోవడానికి చూస్తున్నారని, అధికారులు వెంటనే స్పందించి దళితుల భూములో చేసిన వెంచర్ అనుమతిని రద్దు చేయాలన్నారు.

డ్రమ్ సీడర్‌తో మేలు

బల్మూర్: రైతులు వరి నాటువేసే విధానంలో డ్రమ్‌సీడర్ పద్ధతితో ఖర్చు తగ్గుతుందని మండల వ్యసాయాధికారి మహేష్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని బాణాలలో రైతులకు వరి నాటే పద్ధతులపై అవగాహన కల్పించారు.

ఉత్సవాల వేలం పూర్తి

వెల్దండ: మండలంలోని గుండాలలోని అంబారామలింగేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించే ఉత్సవాలకు సోమవారం నిర్వహించిన వేలంలో రూ.7.10లక్షల ఆదాయం వచ్చింది. టెంకాయల వేలం రూ.3.21లక్షలు, లడ్డు, పులిహోరకు రూ.2.50లక్షలు, టెంకాయల ఏడాది వేలంలో రూ.75వేలు, టెంకాయ చిప్పలకు రూ.34వేలు, తైబజార్‌కు రూ.15వేలు, కూల్‌డ్రింక్స్‌కు రూ.15వేల చొప్పున దక్కించుకున్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూర్ సమీపంలో ఈనెల 23న రాత్రి బైక్‌ను గుర్తు తెలియని ట్రాక్టర్ ఢీకొట్టిన ప్రమాదంలో పెనిమిళ్లకు చెందిన వెంకటేష్ గౌడ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఏఎస్‌ఐ అంజయ్య తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ కొరటికల్‌కు చెందిన శ్రీశైలంగా గుర్తించడంతోపాటు అతడు అతివేగంగా, అజాగ్రత్తగా ట్రాక్టర్‌ను నడపడంతోనే తన భర్త ప్రమాదానికి గురైనట్లు సోమవారం వెంకటేష్‌గౌడ్ భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తెనుగోళ్ల ఔన్నత్యాన్ని చాటాలి

తాడూరు: సమాజంలో తెనుగోళ్ల కులంలో పుట్టిన ప్రతి బిడ్డ జాతి ఔన్నత్యాన్ని చాటాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెనుగోళ్ల జిల్లా భవన సాధన కమిటీ కన్వీనర్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా భవన కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జనాభాలో అత్యధికంగా ఉన్న తెనుగు కులం ఆర్థిక, సామాజిక రంగాల్లో వెనకబడి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ప్రత్యేక భవనం నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈ భవన నిర్మాణానికి ప్రతి తెనుగు బిడ్డ కలిసిరావాలని కోరారు. సమావేశంలో యార రమేష్, సంద మల్లయ్య, శ్రీనివాసులు, తిరుపతయ్య, చెన్నకేశవులు, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



మహాత్ముడి అడుగుజాడల్లో నడుద్దాం

మహాత్ముడి అడుగుజాడల్లో అందరూ నడవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో, పలు చోట్ల మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటాలకు, విగ్రహాల వద్ద ఘన నివాళులు అర్పించారు. అహింసావాదంతో ఎంతటి కఠిన లక్ష్యాన్నైనా సాధించవచ్చని మహానేత చెప్పిన మాటలు గుర్తు పెట్టుకోవాలన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



వెల్దండలో గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యార్థులు, అధికారులు, ఉపాధ్యాయులు



నాగర్‌కర్నూల్‌లో..



అచ్చంపేట మున్సిపల్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు



లింగాలలో..



అమ్రాబాద్‌లో..



పెద్దకొత్తపల్లిలో..



తాడూరులో..



తెలకపల్లిలో..

ఘనంగా పోశమ్మ బోనాలు



బోనాలు ఎత్తుకున్న భక్తులు

కొల్లాపూర్: పట్టణంలో పోశమ్మ బోనాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో తొలి బోనాలు అమ్మవారికి సమర్పించారు. పట్టణంలోని రంగదాసు వీధిలో, ఆర్టీసీ డిపో పక్కన, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వెనక, వరిదేల చెరువు కట్ట కింద, ఎస్సీ హాస్టల్ సమీపంలో గల పోశమ్మ గుళ్ల వద్దకు భక్తులు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వచ్చారు. నైవేద్యాలు సమర్పించి, కోళ్లు,పోటేళ్లు బలి ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కౌన్సిలర్లు, నాయకులు దేవతను దర్శించుకున్నారు.

కరాటేలో విద్యార్థి ప్రతిభ

కొల్లాపూర్: హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో నిర్వహించిన తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీల్లో పట్టణానికి చెందిన సాయి పవన్ సిల్వర్‌మెడల్ సాధించారు. పతకం సాధించిన ఆయనను సోమవారం పట్టణంలో కోచ్ రాజుయాదవ్‌తో పాటు పలువురు అభినందించారు.

టీఎన్‌జీఓ అధ్యక్షుడికి అవార్డు

కల్వకుర్తిరూరల్: టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌కు స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డు లభించింది. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న భారతీయ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆయనకు అవార్డును అందించారు. పట్టణానికి చెందిన ఈయన వివిధ సామాజిక సేవా కార్యక్రమాల్లో అందించిన సేవలకు అవార్డును అందించినట్లు ఆయన తెలిపారు.

మాజీ సర్పంచ్ మృతి

తాడూరు: మండలంలోని అల్లాపూర్ మాజీ సర్పంచ్ జంగయ్య(75) సోమవారం సాయంత్రం మృతిచెందారు. సర్పంచ్‌గా గ్రామానికి ఎంతో అభివృద్ధి చేశారని గ్రామస్తులు సానుభూతి వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లురవి కుటుంబసభ్యులను పరామర్శించారు. జంగయ్య పార్టీ సీనియర్ కార్యకర్తగా, సర్పంచ్‌గా ఆయన చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

కల్వకుర్తిరూరల్: అన్నదానం మహాదానం అని లయన్స్ ఇంటర్‌నేషనల్ మాజీ గవర్నర్ రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి హాజరై ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, జగదీశ్వర్, రాఘవేందర్, రఘు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

వనరులను సద్వినియోగం చేసుకుందాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్ రూరల్: ప్రజలకు అవసరమైన, అందుబాటులో ఉన్న వనరులతో గ్రామాభివృద్ధి చేసుకోవాలని పాలెం కేవీకే రావేఫ్ విద్యార్థులు తెలిపారు. సోమవారం మండలంలోని కుమ్మెరలో గ్రామ అవసరాల సద్వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రధానంగా గ్రామ విశ్లేషనాత్మక తులనంతో పటాన్ని వేసి వివరించారు. వివిధ సాంకేతికతలను ఉపయోగించి జనాభా ఆధారంగా పంటలు పండించుకుని, ప్రజల నివాస విధానాన్ని గ్రామానికి సంబంధించిన అవసరాలను సేకరించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఆఫీసాజహాన్, సర్పంచ్ శ్రీదేవి, ఉప సర్పంచ్ శ్రీశైలం, కార్యదర్శి శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో పారదర్శకత



మేడిపూర్‌లో ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

● జాబ్‌కార్డులకు ఆధార్‌లింక్ తప్పనిసరి

తాడూరు: ఉపాధి హామీ పథకంలో పారదర్శకత ఉండడంతోపాటు అవతవకలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు తీసుకువచ్చింది. గతంలో ఉపాధి కూలీల వివరాలు మస్టర్‌లో నమోదు చేసుకునేవారు. దీంతో అవతవకలకు ఆస్కారం ఉంటుందనే ఉద్దేశంతో ఇక నుంచి ప్రతి కూలి వివరాలను నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల మొదటి వారంలో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

11,040 జాబ్‌కార్డులు

ఉపాధి పనులు చేసేందుకు పేర్లు నమోదు చేసుకున్న కూలీలు తమ ఆధార్‌కార్డులను జాబ్‌కార్డులను అనుసంధానం చేసుకోవాలి. మండలంలో 11,040 జాబ్‌కార్డులున్నాయి. 5,400 జాబ్‌కార్డులు సంబంధించిన వారు మాత్రమే పనులు చేస్తున్నారు. వీరంతా ఈ నెల చివరి వరకు ఆధార్ కార్డులను అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. ఆయా గ్రామాలలోని ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు ఆధార్‌కార్డు జిరాక్స్ అందిస్తే వారు జాబ్‌కార్డుతో అనుసంధానం చేస్తారు. ఈజీఎస్ అధికారుల సాఫ్ట్‌వేర్ రోజుకు 100 నుంచి 150 కూలీల ఆధార్ కార్డులు మాత్రమే తీసుకోవడంతో ప్రక్రియ నిదానంగా సాగుతుంది. ప్రభుత్వం ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని ఆదేశించడంతో కార్యాలయంలో కంప్యూటర్‌ల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు.

> **జాప్యం లేకుండా డబ్బులు జమ**
>
> ఉపాధి పనులలో అవతవకలను అరికట్టేందుకు కూలీలు తమ జాబ్‌కార్డులను ఆధార్ కార్డుతో అనుసంధానం చేసుకోవాలి. జాబ్ కార్డులకు వాటిని అనుసంధానం చేయడంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. జాప్యం లేకుండా కూలీల ఖాతాలో డబ్బులు జమ అవుతాయి.
>
> – గంగామోహన్, ఎంపీడీఓ, తాడూరు

ఆన్‌లైన్‌లోనే ఉపాధి హాజరు

ఆధార్ జాబ్‌కార్డు అనుసంధానం చేయంతో కూలీల హాజరు గతంలో మేటీల ద్వారా చేయగా, గతేడాది మే నుంచి ఆన్‌లైన్ ప్రక్రియ మొదలైంది. ఇప్పటివరకు ఎలాగో నమోదు అయినా, ఇక నుంచి మాత్రం పూర్తిగా ఆన్‌లైన్‌లోనే హాజర్ నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కూలీలు పనిచేసే ఫొటోలు సైతం నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ విధానంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ప్రభుత్వ ఆలోచన. మండలంలోని 60 శాతం నమోదు పూర్తి అయినట్లు అధికారులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బిజినేపల్లి: వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించి సరైన సమయంలో అధిక దిగుబడులు సాధించాలని నాగపూర్‌కు చెందిన సీఐసీఆర్ సీనియర్ శాస్త్రవేత్త చిన్నబాబునాయక్ అన్నారు. సోమవారం పాలెం కేవీకేలో భారతీయ పత్తి పరిశోధన సంస్థ, కేవీకేల ఆధ్వర్యంలో సంయుక్తంగా గిరిజన ఉప పథకం కింద టార్పాలిన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. సీనియర్ శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ గిరిజన రైతులు 2022–23 సంవత్సరాని కంటే వచ్చే పంట కాలానికి అధిక దిగుబడులు సాధించాలని, అందుకోసం ఇప్పటికే కొందరు రైతులకు స్ప్రేయర్లు, టార్పాలిన్‌లు, ఇతరత్ర వ్యవసాయ పరికరాలు అందజేశామన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో యాంత్రీకరణ, సాంకేతికతను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలన్నారు.



రైతులకు టార్పాలిన్‌లను అందిస్తున్న శాస్త్రవేత్తలు

కంటివెలుగు శిబిరం ప్రారంభం



పరిశీలిస్తున్న చైర్మన్ సత్యం

కల్వకుర్తి: మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. చైర్మన్ మాట్లాడుతూ కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం 4వ వార్డులో శిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవీందర్, డాక్టర్ జ్యోతి, కమిషనర్ అశ్రిత్‌కుమార్, రాము పాల్గొన్నారు.

ఉప్పునుంతల: మండలంలోని లక్ష్మాపూర్‌లో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ పుష్పావతి ప్రారంభించారు. మొదటి రోజు మొత్తం 153 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి జాన్సన్ తెలిపారు. వారిలో 20 మందికి కంటి అద్దాలు అందజేయగా 12 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్లు తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



కుందారంతండాలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ: మండలంలోని గిరిజనతండాలకు ప్రభుత్వం మంజూరు చేసిన బీటిరోడ్లకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపనలు చేశారు. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి, వెల్దండ మండలాలకు మొత్తం 13బీటీరోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఒక్కో పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షల చొప్పున నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీ విజయ, వైస్‌ఎంపీపీ శాంతి, జెడ్పీటీసీ విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి తండాకు రవాణా సౌకర్యం

చారకొండ: రాష్ట్రంలో ప్రతి తండాకు రవాణా సౌకర్యం సులభతరం చేస్తు, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మండలంలోని జూపల్లి పంచాయతీ పరిధిలోని నెమలిగుట్టతండా నుండి జూపల్లి వరకు బీటీ రోడ్డుకు సోమవారం నెమలిగుట్టతండాలో ఎమ్మెల్యే పనులకు శంకుస్థాపన చేశారు. పేదలందరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే తీరుపై వాగ్వాదం

వైస్ ఎంపీపీ తనయుడు వెంకటయ్యయాదవ్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేపై తీరుపై ఆగ్రహించారు. తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని అనడంతో ఎమ్మెల్యే సభలో నుంచి వెళ్లిపోయారు. కొద్దిసేపు కారులో ఉండి సర్ది చెప్పడంతో కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మహిళా శిశుసంక్షేమ శాఖ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సోమవారం రాత్రి లబ్ధిదారులకు అందజేశారు. ఇందిరానగర్‌కు చెందిన వినోద్‌కుమార్‌కు రూ.లక్ష, చంద్రాయన్‌పల్లి చెందిన కృష్ణకు రూ.50వేలు, పోచమ్మగడ్డతండాకు చెందిన లింబ్యాకు రూ.50 వేల చెక్కులను ఇచ్చారు.

మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతాం



పట్టణంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్: మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణంలో పర్యటించారు. వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తన నివాసం వద్ద పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో జంక్షన్ ఏర్పాటు, సుందరీకరణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. పట్టణంలో జంక్షన్ల ఏర్పాటుతో పాటు పలు అభివృద్ధి పనుల కోసం ఎస్‌డీఎఫ్ ద్వారా రూ.10.40 కోట్లు నిధులు ఇప్పటికే మంజూరయ్యాయని తెలిపారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, ఎంపీపీ బోజ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణయ్య, నరేందర్ రెడ్డి తదితరులున్నారు.

సిరులు కురిపిస్తున్న గోవులు



గోవులు, కోడెదూడలతో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, రైతు, సిబ్బంది

బల్మూర్: నిరుపేద దళిత రైతు కుటుంబానికి తిరుమల తిరుపతి దేవస్థానం వితరణగా ఇచ్చిన గోవులు ఆపన్న హస్తంగా మారి ఆదుకుంటున్నాయి. మండలంలోని తుమ్మెన్‌పేట చెందిన రైతు మద్దెలగండ్ల తిరుపతయ్యకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగులో గిట్టుబాటు కాకపోవడంతో తన పొలాన్ని కౌలుకు ఇచ్చి వ్యవసాయ కూలీగా మారాడు. ఈ క్రమంలో కలెక్టర్ చొరవతో 2021లో తిరుమల తిరుపతి దేవస్థానం వారి గోశాల నుంచి రెండు మేలుజాతి గోవులను వితరణగా పొందాడు. ఈ గోవులే అతని కుటుంబానికి వరంగా మారి ప్రస్తుతంతో అవి ఇచ్చే పాలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వాటి ద్వారా వచ్చే ఆదాయంతో వ్యవసాయాన్ని తిరిగి సాగు చేసుకుంటున్నాడు. అతనికి ఇచ్చిన గోవులు తన వద్దకు వచ్చిన నెలలోపే రెండు కోడెదూడలకు జన్మనివ్వడంతో అతని ఇంట సిరుల పంట ప్రారంభమైంది. గోవులతో ఒక పక్క ప్రకృతి వ్యవసాయం సాగిస్తునే మరోపక్క దానికి అనుబంధంగా భార్య సహకారంతో గోవుల ద్వారా వచ్చే పాలు (రోజుకు 20లీటర్ల)కు నెలకు రూ.15 వేల వరకు ఆధాయం పొందుతున్నాడు. పాలతో వచ్చే ఆదాయంతో తన పిల్లలకు ఇబ్బంది లేని చదువుతో పాటు వారికి కావాల్సి వసతులు కల్పిస్తున్నాడు.

అభినందించిన జిల్లా పశువైద్యాధికారి

ఆవులను సద్వినియోగం చేసుకోని తన కుటుంబానికి ఆర్థికంగా మలుచుకున్న తిరుపతయ్యను జిల్లా పశువైద్యాధికారి రమేష్ గ్రామానికి వచ్చి అభినందించారు. రైతులు నిరాశకు గురి కాకుండా వచ్చిన ఫలాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

> **గోవులే ఆధారం..**
>
> తన భూమిలో వ్యవసాయం చేసినా గిట్టుబాటురాక కౌలుకు ఇచ్చి కూలీగా మారాను. కలెక్టర్ చొరవతో గ్రామంలో తనతో పాటు కొంత మందికి గోశాల నుంచి గోవులను వితరణగా ఇచ్చారు. ఇచ్చిన ఆవులు నెల లోపే రెండు దూడలను జన్మించడంతో వాటితో వచ్చే పాల ఆదాయంతో తిరిగి వ్యవసాయాన్ని చేస్తు పిల్లలను చదివిస్తున్నాడు. కోడె దూడలు కూడా వ్యవసాయాసాగులో సహకారం ఇస్తున్నాయి. – మద్దెలగండ్ల తిరుపతయ్య, రైతు, తుమ్మెన్‌పేట